

# సిద్దిపేట సంగారెడ్డి మెదక్



## రోడ్డును మరమ్మత్తులు చేయండి సారు :

**రోడ్డుకు ఇరువైపులా మురికి కాలువలను నిర్మించండి**

**అధికారుల పై మండిపడ్డ 10వ వార్డ్ బిఆర్ ఎస్ పార్టీ సీనియర్ లీడర్ మహమ్మద్ ఇమ్రాన్**



**జహీరాబాద్, జూలై 21(ప్రజా జ్యోతి న్యూస్)**

పట్టణ మున్సిపాలిటీ అధికారుల వైపల్లెమే కాకుండా స్థానిక శాసనసభ్యులు పార్లమెంట్ సభ్యులు ఉన్నప్పటికీ ఇటీవలే మున్సిపాలిటీ ఎన్నికలు పూర్తయినప్పటి కూడా ఎందుకు నిర్లక్ష్యంగా అధికారులు ఉంటున్నారు నాకైతే అర్థం కావడం లేదు బాగా రెడ్డి ఫ్లైఓవర్ నుండి రాంనగర్ వరకు ప్రధాన రహదారి పూర్తిగా పాడైనప్పటికీ కనీసం ఆ గుంతలు కూడా పూడ్చలేని అధికారులు ఎందుకు ప్రజల పైన టాక్స్ లా బారాలు ఎందుకు ఈ ప్రాంత ప్రజలు ఈ రహదారిపై ప్రయాణిస్తున్నప్పుడు ప్రాణాలను గుడ్డ మెట్టు అంటూ భయంతో ప్రయాణిస్తున్నారు నేను అనేకసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ కూడా అధికారులు మాత్రం చేపిస్తాం చేస్తామంటూ పాపం గాడి పోతున్నారు. ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే ఈ రోడ్డుపైన 2 వైపుల కాల్వలు నిర్మించి ఆ తర్వాత మధ్యలో డివైడర్ నిర్మించి రోడ్డును వెడల్పు చేయాల్సిందిగా అధికారులను హెచ్చరిస్తున్నా జహీరాబాద్ ఆర్డిఓ మరియు జహీరాబాద్ మునిసిపాలిటీ కమిషనర్ మరియు శాసనసభ్యులు పార్లమెంట్ సభ్యులకు మరొకసారి నేను కోరుతున్న దాదాపు మా రాంనగర్ ప్రాంతంలో 30 వేల జనాభా వరకు నివసిస్తున్నారు వారిపై కనీస అవసరాలు తీర్చడం మీ బాధ్యతని అన్నారు.

## ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ

**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 21:**

ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే జన్మదినాన్ని పురస్కరించుకుని జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షెట్కార్ మంగళవారం ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఖర్గేకు పుష్పగుచ్ఛం అందజేసి దీర్ఘాయుష్షు, మంచి ఆరోగ్యం కలగాలని ఆకాంక్షించారు.



ఈ కార్యక్రమంలో ఎంపీలు మల్లు రవి, బలరాం నాయక్, చామల కిరణ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొని మల్లికార్జున్ ఖర్గేకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## అంగరంగ వైభవంగా రేణుక ఎల్లమ్మ బోనాలు వేడుకలు

**మాజీ యూత్ కాంగ్రెస్ జహీరాబాద్ మండల్ ప్రెసిడెంట్ మేకల రాములు**

**జహీరాబాద్, జూలై 21 (ప్రజా జ్యోతి న్యూస్)**

నియోజకవర్గ పట్టణ పరిధిలోని రాంనగర్ కాలనీలో మాజీ యూత్ కాంగ్రెస్ జహీరాబాద్ మండల్ ప్రెసిడెంట్ మేకల రాములు ఆధ్వర్యం లో అంగరంగ వైభవంగా బోనాల వేడుకలు ఘనంగా నిర్వ హించారు. మానవ జీవన విధానానికి సాంస్కృతి సాంప్రదాయాలకు ప్రత్యేక నిలిచిన బోనాల పండుగ అత్యంత వైభవంగా ప్రారంభమైంది. మంగళ వారం నాడు పలు కాలనీ లలో రేణుక ఎల్లమ్మ అమ్మవారి ఆలయానికి భక్తులు కిక్కిరిసి పోయారు. ఉదయం నుంచి ఆలయం వద్ద ఆధ్యాత్మిక వాతా వరణం సంతరించు కుంది. సకల జనులను చల్లగా చూడు తల్లి అంటూ అమ్మవారికి అంటూ మహిళలు అమ్మవారి బోనాలు సమర్పించు కున్నారు. ఆషాడ మాసంలో ఈ బోనాలు పండుగను ఈ రాష్ట్రంలోని ప్రతి పల్లెలోని కాలనీలలో పట్టణాల్లోనూ జరుపుకోవడం జరుగు తుంది. ఈ బోనాలు పోతరాజుల ఆటపాటలతో ఖాజా భజంత్రీల నృత్యాలు చేస్తూ ఇంటింటి బోనాన్ని తీసుకొని రేణుక ఎల్లమ్మ ఆలయా నికి చేరుకుంటారు. అనంతరం అమ్మవారు ఆలయం దగ్గర తీర్థ ప్రసాదాలు భోజనాలు స్వీకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎం బాలప్ప,సి నర్సింలు, తిరుమలి, వెంకటేష్, సి బాలరాజ్, ఏం రమేష్, మేకల రాజు, మేకల కిష్టప్ప కాళివాసులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# "ప్రజాస్వామ్యానికి తొలి పాఠం పాఠశాల నుంచే ప్రారంభం"






విద్యార్థుల్లో ప్రజాస్వామ్య స్ఫూర్తి పెంపే ఎన్నికల ప్రధాన ఉద్దేశ్యం
ఓటు విలువను విద్యార్థులకు తెలియజేసేందుకే ఈ ఎన్నికలు
ప్రధానోపాధ్యాయులు బి.సాంబయ్య

**వెల్దుర్తి (ప్రజాజ్యోతి) జూలై 21:** వెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుతమైన పౌరసత్వాన్ని పెంపొందించే లక్ష్యంతో హెడ్ బాయ్ -- హెడ్ గర్ల్ ఎన్నికలను ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించి ఎన్నికల్లో పాల్గొనగా, 10వ తరగతి విద్యార్థి బి. అజయ్ గౌడ్ హెడ్ బాయ్‌గా, సదాల లిఖిత హెడ్ గర్ల్‌గా విజయం సాధించారు. విజేతలను ప్రధానోపాధ్యాయులు బి. సాంబయ్య అభినందిస్తూ, పాఠశాలకు ఆదర్శ నాయకులుగా బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించాలని సూచించారు. ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ నైపుణ్యాలు, సేవాభావం వంటి గుణాలను విద్యార్థుల్లో పెంపొందించేందుకు ఇలాంటి ఎన్నికలు ఎంతో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటస్వామి, శ్రీనివాసరావు, నర్సింహారెడ్డి, చార్లెస్, నవనీత, అమూల్య, సునీత, వెంకట్ రెడ్డి, ధనరాజ్, జయసుధ, ప్రశాంతి దేవి, రేణుకా దేవి, రాము తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# శ్రీలంక దృష్టిని ఆకర్షించిన మల్కాపూర్ గ్రామం..



తెలంగాణలో ఆదర్శ గ్రామంగా మల్కాపూర్ గుర్తింపు
సర్పంచ్ పంజాల ఆంజనేయులు గౌడ్





**తూప్రాన్ (ప్రజాజ్యోతి) జూలై 21:** తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామం అంతర్జాతీయ స్థాయిలో మరోసారి ప్రశంసలు అందుకుంది. మంగళవారం ఎన్ఐఆర్డీ ఆధ్వర్యంలో శ్రీలంకకు చెందిన ప్రజాప్రతినిధుల బృందం గ్రామాన్ని సందర్శించి, గత పదేళ్లలో సాధించిన అభివృద్ధిని ప్రత్యక్షంగా పరిశీలించింది. గ్రామ సర్పంచ్ పంజాల ఆంజనేయులు గౌడ్ గ్రామంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేసిన సంక్షేమ పథకాలు, గ్రామాభివృద్ధి ప్రణాళికల గురించి సమగ్రంగా వివరించారు. అనంతరం బృందం మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, రాక్ గార్డెన్, డంపింగ్ యార్డ్ వంటి మౌలిక సదుపాయాలను పరిశీలించి వాటి నిర్వహణపై ప్రశంసలు కురిపించింది. అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను సందర్శించిన శ్రీలంక ప్రతినిధులు విద్యార్థులతో నేరుగా మాట్లాడి ప్రభుత్వ పథకాల అమలు తీరును తెలుసుకున్నారు. అంచెలంచెలుగా అభివృద్ధి సాధించి ఆదర్శ గ్రామంగా నిలిచిన మల్కాపూర్ తీరు తమను ఎంతో ఆకట్టుకుందని శ్రీలంక ప్రతినిధులు పేర్కొన్నారు. ఇక్కడ విజయవంతంగా అమలవుతున్న అభివృద్ధి నమూనాలు, గ్రామ పాలన విధానాలను తమ దేశంలోనూ అమలు చేసేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. అనంతరం తూప్రాన్ మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించిన బృందం, అధికారుల పనితీరు, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల అమలుపై వివరాలు తెలుసుకుంది. ఈ పర్యటనలో ఎంపీవో సతీష్, గ్రామ సర్పంచ్ పంజాల ఆంజనేయులు గౌడ్, ఎన్ఐఆర్డీ ప్రతినిధులు ఆశాలత, సాయిలు, శ్రీలక్ష్మి, ఉపసర్పంచ్ స్వామి, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ సురేష్, పంచాయతీ కార్యదర్శి మహేశ్వరి, పాలకవర్గ సభ్యులు పిట్ల వేణు, జిన్న కృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ కనకరాజు, మేకిన్ యువత, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు స్వర్ణలత, లావణ్య, ఐకేపీ వీవోఏ సంతోష్, ఆశా వర్కర్ ఇందిరా, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## 'రైతు భరోసా' దరఖాస్తులకు మరో అవకాశం..

అర్హులైన రైతులు.. జూలై 31లోపే నమోదు చేయించుకోండి!
మండల వ్యవసాయ అధికారి కవిత



**వెల్దుర్తి-మాసాయిపేట్ (ప్రజాజ్యోతి) జూలై 21:** రాష్ట్ర ప్రభుత్వం వానాకాలం 2026-27 సీజన్‌కు సంబంధించి రైతు భరోసా పథకం కింద కొత్త దరఖాస్తుల స్వీకరణతో పాటు బ్యాంకు ఖాతా వివరాల సవరణకు ఈ నెల 31వ తేదీ వరకు మరో అవకాశం కల్పించినట్లు మండల వ్యవసాయ అధికారి కవిత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 2026 జూన్ 15వ తేదీ వరకు కొత్త భూ పట్టా పాసుపుస్తకం పొందిన రైతులు, అలాగే ఇప్పటి వరకు భూ పట్టా పాసుపుస్తకం కలిగి ఉన్నప్పటికీ రైతు భరోసా ప్రయోజనం పొందని అర్హులైన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే రైతులు రైతు భరోసా దరఖాస్తు పత్రం, భూ పట్టా పాసుపుస్తకం నకలు, ఆధార్ కార్డు, బ్యాంకు పాసుపుస్తకం మొదటి పేజీ లేదా రద్దు చేసిన చెక్కు, మొబైల్ నంబర్ సమర్పించాలని తెలిపారు. రైతులు తమ దరఖాస్తులను రైతు వేదికలోని వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద నమోదు చేసుకోవచ్చన్నారు. అదేవిధంగా, ఇప్పటికే రైతు భరోసా పథకంలో నమోదైన రైతులు ఏవైనా కారణాలతో బ్యాంకు ఖాతా మార్చుకోవాల్సి వచ్చినా జూలై 31లోపు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి అవసరమైన పత్రాలతో వివరాలను సవరించుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి రైతు గడువు ముగిసేలోపు వివరాలు నమోదు చేసుకుని రైతు భరోసా పథకం ప్రయోజనం పొందాలని మండల వ్యవసాయ అధికారి విజ్ఞప్తి చేశారు.

## డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్

**పరిశుభ్రతలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలి...**
**మున్సిపల్ కమిషనర్ రమేష్**



**తూప్రాన్ (ప్రజాజ్యోతి) జూలై 22:** మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో సోమవారం ప్రత్యేక పారిశుద్ధ్య (స్పెషల్ డ్రైవ్) కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 4వ వార్డు కౌన్సిలర్ జైపాల్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ రమేష్ మాట్లాడుతూ, మన ఇంటి పరిశుభ్రతే మన ఆరోగ్యానికి రక్షణ అని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పిచ్చి మొక్కలు, గడ్డి పెరగకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. ప్రజలు మున్సిపల్ సిబ్బందికి సహకరించి పారిశుద్ధ్య కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని, అందరి సహకారంతో తూప్రాన్ మున్సిపాలిటీని పరిశుభ్రతలో ఆదర్శంగా నిలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో 4వ వార్డు కౌన్సిలర్ జైపాల్ నాయక్, బీఆర్ఎస్ నాయకుడు కొక్కొండ కాశిరెడ్డి, మున్సిపల్ మేనేజర్ శ్రీకాంత్, శానిటేషన్ అధికారులు మధు, విష్ణువర్ధన్, మున్సిపల్ సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి దామోదర్--పద్మిని దంపతులకు శుభాకాంక్షల వెల్లువ

వివాహ వార్షికోత్సవం సందర్భంగా సంగారెడ్డి నివాసంలో ఘన సన్మానం

సోషల్ మీడియాలో అభిమానుల సందడి

**అందోల్, (ప్రజాజ్యోతి):** తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మరియు సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి సి. దామోదర్ రాజనర్సింహ, శ్రీమతి పద్మిని దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం శుభాకాంక్షల వెల్లువ కొనసాగింది. రాజకీయ, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా అందోల్--జోగిపేట పురపాలక సంఘం పాలకవర్గ చైర్మన్‌తో పాటు మాజీ చైర్మన్లు, ప్రస్తుత కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సంగారెడ్డిలోని మంత్రి నివాసానికి వెళ్లి దంపతులను ఘనంగా సన్మానించారు. పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాతో సత్కరించి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

**సోషల్ మీడియాలో శుభాకాంక్షల సందడి**

వివాహ వార్షికోత్సవం సందర్భంగా అందోల్ నియోజకవర్గం వ్యాప్తంగా సోషల్ మీడియా వేదికలు శుభాకాంక్షల సందేశాలతో నిండిపోయాయి. కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు ఫొటోలు, పోస్టర్లు, వీడియోలు పంచుకుంటూ మంత్రి దామోదర్ రాజనర్సింహ--పద్మిని



దంపతులకు తమ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. దంపతులు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, ఆనందంగా జీవించాలని ఆకాంక్షిస్తూ పోస్టులు వైరల్ అయ్యాయి.

**ప్రజలకు చేరువైన నాయకుడికి అభిమానుల అభినందనలు**

ప్రజల సమస్యల పరిష్కారంలో చురుకుగా వ్యవహరించే నాయకుడిగా గుర్తింపు పొందిన మంత్రి దామోదర్ రాజనర్సింహకు ఈ సందర్భంగా అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష ఆదరణ కనిపించింది. వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన దంపతులకు అందిన శుభాకాంక్షలు, అభిమానుల ఆప్యాయతకు నిదర్శనంగా నిలిచాయి.

# ద్విచక్ర వాహనాల చోరీల కేసులను ఛేదించిన ఖేడ్ పోలీసులు





-16 కేసుల నిందితుడు అరెస్ట్

-- 6 చోరీ ద్విచక్ర వాహనాలు స్వాధీనం

-- నారాయణఖేడ్ ఎస్సై రాసుల శ్రీశైలం

**నారాయణఖేడ్, (ప్రజాజ్యోతి జూలై 21:** నారాయణఖేడ్ పట్టణంలో ఇటీవల వరుసగా చోటుచేసుకున్న ద్విచక్ర వాహనాల చోరీ కేసులను పోలీసులు ఛేదించి, నిందితుడిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి ఆరు చోరీ చేసిన ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు నారాయణఖేడ్ ఎస్సై రాసుల శ్రీశైలం అన్నారు. మంగళవారం నారాయణఖేడ్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..గత వారం రోజులుగా రెండు బైక్‌లు చోరీకి గురైనట్లు ఫిర్యాదులు రావడంతో కేసులు నమోదు చేసి ప్రత్యేక దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా మంగళవారం వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న దుర్గాప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా, అతడు పలు బైక్ దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించాడు. అతని వద్ద నుంచి మొత్తం ఆరు చోరీ ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిపై ఇప్పటికే వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో 15 దొంగతనాల కేసులు నమోదై ఉన్నాయన్నారు. జైలుశిక్ష అనుభవించి వచ్చినప్పటికీ అతని ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో, జల్సాలకు అలవాటుపడి మళ్లీ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడైందన్నారు. ప్రజలు తమ వాహనాలకు తప్పనిసరిగా భద్రతా చర్యలు తీసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. వరుస బైక్ చోరీ కేసులను ఛేదించడంలో కీలకంగా పనిచేసిన ఎస్సై రాసుల శ్రీశైలం, పోలీసు సిబ్బందిని ఉన్నతాధికారులు, స్థానిక ప్రజలు, నారాయణఖేడ్ సీఐ శ్రీనివాస్ రెడ్డి అభినందించారు.

## సోషల్ మీడియా నిర్లక్ష్యానికి భారీ మూల్యం.. ఏడాది జైలు, 50 వేల జరిమానా

జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు



**తూప్రాన్ (ప్రజాజ్యోతి) జూలై 21 :** మెదక్ జిల్లా తూప్రాన్‌లో చిన్నారులకు సంబంధించిన అశ్లీల వీడియోలను సోషల్ మీడియా ద్వారా షేర్ చేసిన కేసులో పోక్సో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు కఠిన తీర్పు వెలువరించింది. తూప్రాన్‌కు చెందిన అరిగే శివకుమార్ (20)కు ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ.50 వేల జరిమానా విధించింది. తూప్రాన్ ఎస్ఐ శివానందం 2025 మే 12న కేసు నమోదు చేయగా, అప్పటి సీఐ రంగకృష్ణ దర్యాప్తు పూర్తి చేసి ఛార్జిషీట్ దాఖలు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య వాదనలు వినిపించగా, సాక్ష్యాధారాలను పరిశీలించిన పోక్సో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు న్యాయమూర్తి సుభావాలి నిందితుడికి ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ.50 వేల జరిమానా విధించారు.ఈ కేసులో ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ కృష్ణ, సీడీట నాగరాజు కీలకంగా పనిచేశారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన దర్యాప్తు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు తెలిపిన వివరాల ప్రకారం, నిందితుడు నకిలీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా సృష్టించి చిన్నారులకు సంబంధించిన అశ్లీల కంటెంట్‌ను ఇతరులకు పంపుతున్నట్లు పోలీసులు గుర్తించారు. సైబర్ క్రైమ్ విభాగం సాంకేతిక ఆధారాలు, ఐపీ అడ్రస్‌ల విశ్లేషణతో నిందితుడిని గుర్తించి కేసు నమోదు చేశారు.దర్యాప్తు అనంతరం సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన పోక్సో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు నిందితుడిని దోషిగా నిర్ధారించి జైలు శిక్షతో పాటు జరిమానా విధించింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు ప్రజలకు కీలక హెచ్చరిక చేశారు. చిన్నారులకు సంబంధించిన అశ్లీల కంటెంట్‌ను చూడటం, డౌన్‌లోడ్ చేయడం, మొబైల్‌లో భద్రపరచడం, షేర్ చేయడం లేదా సోషల్ మీడియాలో ప్రచారం చేయడం చట్టరీత్యా తీవ్రమైన నేరం అని స్పష్టం చేశారు. ఇలాంటి నేరాలకు పాల్పడే వారిని సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సోషల్ మీడియాలో చట్టవిరుద్ధమైన లేదా అసభ్యకరమైన కంటెంట్ కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, చిన్నారుల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

## ఢిల్లీలో విద్యార్థులపై దాడిని తీవ్రంగా ఖండించిన నవోదయ సిద్ధార్థ



నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 21: ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై జరిగిన దాడిని ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ చైర్మన్ నవోదయ సిద్ధార్థ తీవ్రంగా ఖండించారు. మంగళవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొంటూ.. విద్యార్థులే దేశ భవిష్యత్తుకు బలమైన పునాది అని అన్నారు. దేశ అభివృద్ధిలో యువత, విద్యార్థుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. విద్యార్థుల గొంతును అణిచివేయడం కాకుండా, వారి అభిప్రాయాలను ప్రజాస్వామ్య స్ఫూర్తితో వినాలని ప్రభుత్వాలను కోరారు. దేశంలో పారదర్శకత, జవాబుదారీతనం, అవినీతి రహిత పరిపాలన బలోపేతం కావాలంటే విద్యావంతులు, జ్ఞానం, మానవత్వం, నైతిక విలువలు కలిగిన నాయకత్వం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. దేశం పట్ల అంకితభావంతో పనిచేసే యువ నాయకత్వం ముందుకు వస్తేనే పాలనా వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని పేర్కొన్నారు. ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన దాడి ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు.